www.namasthetelangaana.com/districts/hyd/

ఆదివారం | 28 జూలై | 2013
పేజీలు 20

నమస్తే తెలంగాణ
హైదరాబాద్

గరిష్ఠం 31°C
కనిష్ఠం 22°C

facebook.com/nthyderabad



# ఇన్‌కాయిస్‌లో ఓపెన్ డే

- సునామి, భూకంపాలపై విద్యార్థులకు అవగాహన
- 24 దేశాలకు సునామీ హెచ్చరికల కేంద్రం ఇది

సిటీబ్యూరో, టీ మీడియా : కూకట్‌పల్లి ప్రగతినగర్ కేంద్రంగా పని చేస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) సేవలపై శనివారం ఓపెన్ డే నిర్వహించారు. భూభౌతిక శాస్త్రం (ఎర్త్‌సైన్స్)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జట్లుగా విద్యార్థులను విభజించి ఇన్‌కాయిస్ పనితీరు, సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆడియో, వీడియోల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సునామి హెచ్చరికల కేంద్రం, సమాచార బ్లాక్, శాటిలైట్ డాటా రిసెప్షన్లను విద్యార్థులు సందర్శించారు. 20 నిమిషాల పాటు సునామీలపై రూపొందించిన చిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు ఒక్కో విభాగంలోని పరికరాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

**పూర్తి స్వదేశీ నైపుణ్యంతో...**

పూర్తి స్వదేశీ నైపుణ్యంతో ఈ కేంద్రాన్ని రూపొందించారు. హిందూ మహా సముద్రం పరిధిలోని 24 దేశాలకు ఈ కేంద్రం నుంచి సేవలందిస్తున్నారు. దేశంలోని 17, ప్రపంచంలోని 300 సైస్మిక్ స్టేషన్ల నుంచి తరంగాలను గ్రహించేంత ఆధునిక పరిజ్ఞానం ఈ కేంద్రం సొంతం. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, హోంమంత్రిత్వశాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఎన్ఆర్ఎస్ఏ, మినిస్ట్రీ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ తదితర శాఖల సహకారంతో 24 గంటల పాటు సేవలందిస్తున్నారు.



ఇన్‌కాయిస్ సేవలు తెలుసుకుంటున్న విద్యార్థులు



**నాలుగు నిమిషాల్లో హెచ్చరికలు...**

భూకంపం, సునామి తరంగాలు వెలువడిన నాలుగు నిమిషాల్లో ఇన్‌కాయిస్ గ్రహిస్తుంది. తరంగాల తీవ్రత 6.5 దాటితే వాటిని ప్రమాదకర తరంగాలుగా పరిగణిస్తారు. ఎంత ఎత్తులో వస్తుంది, ఎంత మేరకు దాని ప్రభావం ఉంటుందనే విషయాలను అంచనావేసి ఆయా శాఖల అధికారులకు సమాచారం అందిస్తారు. గత సంవత్సరం సుమత్రా దీవుల్లో ఆగస్టు 11 న వచ్చిన సునామీ తరంగాలు ఇన్‌కాయిస్ మొట్టమొదటి సారిగా పసిగట్టింది. 2012 ఏప్రిల్ 11న వచ్చిన 8.5 తరంగాలను ఇన్‌కాయిస్ కేంద్రమే గుర్తించింది.